సాక్షి తిరుపతి

శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



మింగేస్తున్న..రాహు-కేతులు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల దందా కొనసాగుతోంది. దక్షిణ పేరుతో భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. - 8లో



..లైట్లు వెలగాలి కదా?

నేనొచ్చినప్పుడైనాలైట్లు వెలగాలి కదా..' అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ సిబ్బందిపై, అధికారులపై మండిపడ్డారు. - 8లో



సీఎంఆర్ జ్యువెలరీ షాపు ప్రారంభం

తిరుపతిలో సీఎంఆర్ జ్యువెలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను గురువారం అట్టహాసంగా ప్రారంభించారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రత్యేక మెడికల్ క్యాంపుపై సమీక్ష



రుయా సూపరింటెండెంట్‌తో చర్చిస్తున్న డీఈఓ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల సందర్భంగా మెడికల్ సర్టిఫికెట్స్ జారీ, పరిశీలన కోసం రుయా ఆస్పత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటుపై సంబంధిత అధికారులు సమీక్షించారు. ప్రత్యేక మెడికల్ క్యాంపులో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సమస్యలపై రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభుని ఏపీ జేఏసీ చైర్మన్ సురేష్‌బాబు, డీఈఓ కేవీఎన్ కుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం కలసి చర్చించారు.

పాల్ ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న డీఈఓ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లాలోని వివిధ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు సంబంధించి పాల్ ట్యాబ్‌లను గురువారం పద్మావతీపురంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో డీఈఓ కేవీఎన్.కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 15 ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, ఏపీ మోడల్ స్కూల్స్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ఒక్కో స్కూలుకు 30 చొప్పున మొత్తం 450 పాల్ ట్యాబ్‌లను అందించినట్లు తెలిపారు. ఈ ట్యాబ్‌లో తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్‌కు సంబంధించి కంటెంట్ ఉంటుందని, తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందని తెలిపారు. అలాగే వృత్తివిద్యకు సంబంధించి వివిధ స్కిల్ డెవలప్‌మెంట్ అంశాలు ఇందులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో తిరుపతి డీవైఈఓ కె.బాలాజీ, సమగ్ర శిక్ష సీఎంఓ సురేష్, జిల్లా పాల్ నోడల్ అధికారి రుక్మాంగధ, జీసీడీఓ పుష్ప, ఏఎస్ఓ సారథి పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలోని శ్రీరంగరాజపురం జెడ్పీ హైస్కూల్‌లో 92 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 77 మంది ఫెయిల్ అయ్యారు. అలాగే గంగాధరనెల్లూరు మండలం ముకలత్తూరు జెడ్పీ హైస్కూల్ లో 25 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఒకే విద్యార్థి ఉత్తీర్ణత సాధించగా మిగిలిన 24 మంది పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోయారు. ఇలాంటి పాఠశాలలు చిత్తూరు జిల్లాలో చాలానే ఉన్నాయి.

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు జెడ్పీ హైస్కూల్‌లో 61 మంది విద్యార్థులకుగాను 23 మంది ఉత్తీర్ణులయ్యారు. మిగిలిన 38 మంది ఫెయిల్ అయ్యారు. కోట మండలం కోట జెడ్పీ హైస్కూల్‌లో 53 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 18 మంది ఉత్తీర్ణులయ్యారు. మిగిలిన 35 మంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. ఇలాంటి పాఠశాలలు తిరుపతి జిల్లాలో చాలానే ఉన్నాయి.



వేల సంఖ్యల్లో ఫెయిల్

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ విద్యా సంవత్సరంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విద్యార్థులు వేల సంఖ్యలో ఫెయిల్ అయ్యారు. చిత్తూరు జిల్లాలో 6,850 మంది ఫెయిల్ కాగా అందులో బాలురు 2,882 మంది అధికంగా పరీక్షల్లో తప్పారు. మిగిలిన 2,700 మంది బాలికలు ఫెయిల్ అయ్యారు. అలాగే తిరుపతి జిల్లాలో 5,381 మంది ఫెయిల్ కాగా అందులో బాలురు 3,259 మంది అధికంగా పరీక్షల్లో తప్పారు. మిగిలిన 2,122 మంది బాలికలు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు జిల్లాల్లో వేల సంఖ్యల్లో విద్యార్థులు పరీక్షల్లో తప్పడంపై కూటమి సర్కారు అనాలోచిత ప్రణాళికలే కారణమని విద్యావేత్తలు విమర్శలు గుప్పిస్తున్నారు.

తిరుపతి, చిత్తూరు జిల్లాల పది ఫలితాల సమాచారం

పరీక్షలకు హాజరైన బాలురు	24,786
ఉత్తీర్ణులైన బాలురు	17,377
పరీక్షలకు హాజరైన బాలికలు	22,689
ఉత్తీర్ణులైన బాలికలు	17,867
ఫెయిల్ అయిన బాలురు	7,409
ఫెయిల్ అయిన బాలికలు	4,822
మొత్తం ఫెయిల్ అయిన విద్యార్థులు	12,231



పదింతల వెనకడుగు

కూటమి సర్కారు నిర్లక్ష్యం.. అనాలోచిత నిర్ణయాలు.. ప్రణాళిక లేమి.. విద్యాశాఖపై కొరవడిన పర్యవేక్షణ..ఉపాధ్యాయుల కొరత.. విద్యార్థికి అందని బోధన.. అభ్యసన సామగ్రి.. వెరసి పది పరీక్షల ఫలితాలపై ప్రభావం చూపింది. తండ్రి రాష్ట్రానికి ముఖ్యమంత్రి.. కుమారుడు సాక్షాత్తు విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించినా వారి నిర్లక్ష్యం.. ఉదాసీనత.. అసంబద్ధ నిర్ణయాలతో సొంత జిల్లాల్లోనే పదో తరగతి విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో పదింతలు వెనుకపడ్డారు. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో పేద పిల్లలు చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

బెడిసికొట్టిన కూటమి సర్కారు ప్రణాళికలు

- సర్కారు పాఠశాలలపై పర్యవేక్షణ శూన్యం
- ఉపాధ్యాయుల కొరతతో పలు సబ్జెక్టుల్లో తప్పిన విద్యార్థులు
- సీఎం సొంత జిల్లాల్లో వేల సంఖ్యలో విద్యార్థులు ఫెయిల్
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రభావం చూపని పది ఫలితాలు

గత ప్రభుత్వ పాలనలో ఇలా..	ఈ ఏడాది కూటమి పాలనలో..
విద్యాసంవత్సరం ప్రారంభంలోనే టీచర్ల కొరత సర్దుబాటుచేసి బోధన	విద్యాసంవత్సరం మధ్యలో టీచర్లను సర్దుబాటు చేయడం
సకాలంలో సిలబస్ పూర్తి	జనవరి, ఫిబ్రవరి నెలల్లోనూ సిలబస్ పూర్తి చేయని పరిస్థితి
ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక మెటీరియల్ ముద్రించి సరఫరా	ప్రస్తుతం అలాంటి మెటీరియల్ జాడే లేదు
ప్రణాళిక ప్రకారం రివిజన్ తరగతుల నిర్వహణ	ఫిబ్రవరి పూర్తి అయినా రివిజన్ తరగతులు లేమి
ఉత్తమ ఫలితాలకోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం, ప్రణాళిక అమలు	ప్రత్యేక సమావేశం లేదు, పటిష్ట ప్రణాళిక సైతం అమలు కాలేదు
కీలకమైన 77రోజుల కార్యాచరణ, ప్రత్యేక తరగతుల నిర్వహణ	కీలకమైన కార్యాచరణ లేనే లేదు. ప్రత్యేక తరగతులు ఆలస్యంగా నిర్వహణ
చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో గత ఏడాది 3,578 మంది విద్యార్థులు ఫెయిల్	ఈ ఏడాది చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 12,231 మంది విద్యార్థులు ఫెయిల్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వేల సంఖ్యల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా పది విద్యార్థులు ఫెయిల్ కావడం విస్మయానికి గురిచేస్తోంది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తొలి మెట్టులాంటి పదో తరగతిపై కూటమి సర్కారు అలసత్వ వైఖరి చూపడంతోనే ఈ చేదు ఫలితాలు చోటు చేసుకున్నట్లు విద్యావేత్తలు పెదవి విరుస్తున్నారు. చిత్తూరు జిల్లాలో 2,436, తిరుపతి జిల్లాలో 2,444 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. చిత్తూరు జిల్లా నుంచి 20,796 మంది, తిరుపతి జిల్లా నుంచి 26,679 మంది మొత్తం 47,475 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో చిత్తూరు జిల్లాలో 13,456, తిరుపతి జిల్లాలో 21,298 మొత్తం 34,754 మంది ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. సీఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లాల్లో పది పరీక్షల్లో ఫలితాలు బోల్తా కొట్టడం పై విద్యావేత్తలు పెదవి విరుస్తున్నారు.

కుప్పంలోనూ అదే వెనుకబాటు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోనూ పది ఫలితాలు వెనుకబడ్డాయి. కుప్పం మండలంలో 1,833 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 703 మంది ఫెయిల్ అయ్యారు. ఇందులో బాలురు అధికంగా 449, బాలికలు 254 మంది పది పరీక్షల్లో తప్పారు. సీఎం ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం మండలంలోనే ఈ పరిస్థితి ఉంటే మిగిలిన మండలాల్లో పరీక్షల్లో తప్పిన విద్యార్థుల సంఖ్య ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. విద్యార్థులకు ప్రభుత్వాలు ఇచ్చే బహుమతి ఏదైనా ఉందంటే అది చదువు ఒక్కటే అని గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆ విషయాన్ని గాలికి వదిలేసింది. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో టీచర్ల కొరతతోనే ఎక్కువ మంది విద్యార్థులు పది పరీక్షల్లో ఫెయిల్ కావాల్సిన దుస్థితి ఏర్పడింది.

అలసత్వం తగదు



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులపై కూటమి సర్కారు ప్రదర్శిస్తున్న అలసత్వ వైఖరి తగదు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పదో తరగతి చాలా కీలకం. అలాంటి పదో తరగతి పరీక్షలపై ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయం. ప్రభుత్వ అలసత్వ వైఖరితోనే సీఎం సొంత జిల్లాలైన చిత్తూరు, తిరుపతి జిల్లాలల్లో వేల సంఖ్యలో విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. – ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్, చిత్తూరు జిల్లా

అనాలోచిన నిర్ణయాలే కారణం



కూటమి ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించకుండా అనాలోచిత నిర్ణయాలు తీసుకుంది. విద్యాసంవత్సరం మధ్యలో సర్దుబాటు కార్యక్రమం ఎవరైనా నిర్వహిస్తారా? అనాలోచిత నిర్ణయాలతో వేల సంఖ్యలో విద్యార్థులు పరీక్షల్లో తప్పారు. ఇందుకు గల కారణాలు విద్యాశాఖ అధికారులు నోరు మెదపకపోవడం బాధాకరం. సీఎం సొంత జిల్లాల్లో వేల సంఖ్యలో విద్యార్థులు ఫెయిల్ కావడం విస్మయానికి గురిచేస్తోంది. – శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి, తిరుపతి జిల్లా

ఎనీటైం కిక్కే!



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి మంగళం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యుడు కళత్తూరు నారాయణస్వామి మండిపడ్డారు. తిరుపతి పద్మావతీపురంలోని వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో ప్రజలకు తాగునీటి కన్నా మద్యమే అధికంగా లభిస్తోందన్నారు. కూటమి పాలనలో బడి, గుడి అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపులు వెలిశాయని, బార్లను తలపించేలా మద్యం షాపులకు పక్కనే పర్మిట్ రూములు ఉన్నాయన్నారు. దానికితోడు ఏ వీధి చూసినా బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయన్నారు. మద్యం, గంజాయి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చిన ఘనత చంద్రబాబుది కాదా? అని ప్రశ్నించారు. ఎన్‌టీ రామారావు మద్యపాన నిషేధాన్ని అమలు చేశారని గుర్తుచేశారు. అయితే ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన ద్రోహి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. ప్రస్తుత చంద్రబాబు పాలనలో కూటమి ఎమ్మెల్యేలు, వారి అనుచరులకే మద్యం షాపులను కట్టబెట్టి విక్రయిస్తున్నారన్నారు. మద్యం ధరలు తగ్గిస్తామని చెప్పి ప్రజల రక్తాన్ని పీల్చుకుతాగుతున్నారని తెలిపారు. గతంలో కూడా చంద్రబాబు పాలనలో విపరీతంగా మద్యం కుంభకోణానికి పాల్పడ్డారని, దానిపై సీఐడీ కూడా కేసు నమోదు చేసిందని గుర్తుచేశారు. అయితే ఆ కేసు ఏమైందని, దానిపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. రాజకీయ కక్షలతో వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపాలన్న కుట్రలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగనన్న పాలనలోనే మద్యం నియంత్రణ

రాష్ట్రంలో జగనన్న పాలన వచ్చాక దశల వారీగా మద్యపానాన్ని నిషేధిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని మాజీ డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఉన్న 4,380 మద్యం షాపుల సంఖ్యను 2,934కు తగ్గించారని, 43 వేల బెల్టుషాపులను, 4,380 పర్మిట్ రూములను రద్దు చేసిన ఘనత జగనన్నదేనన్నారు. జగనన్న పాలనలో మద్యం కుంభకోణం జరిగిందంటూ చంద్రబాబుతో పాటు ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలంతా కూటమి ప్రభుత్వ అరాచకాలను గమనిస్తున్నారని, అందుకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఉర్దూతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి

తిరుపతి కల్చరల్: పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన ముస్లిం విద్యార్థులు ఉర్దూ భాషతో ఇంటర్ విద్యను అభ్యసిస్తే మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ షఫీ అహ్మద్‌ఖాద్రి తెలిపారు. గురువారం గిడ్డంగి వీధిలోని అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరోజినీదేవి రోడ్డులోని ఏటీఎస్ కళాశాలలో ముస్లిం విద్యార్థులకు ప్రత్యేకంగా ఉర్దూభాషతో కూడిన ఇంటర్ విద్యావకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇదే కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఎస్వీ యూనివర్శిటీలో ఉర్దూ, అరబిక్ విభాగాలలో ఎంఏ చదువుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. ఏటీఎస్ కళాశాలలో ఉర్దూతో కూడిన విద్యనభ్యసించే వారికి సంస్థ ద్వారా మెటీరియల్స్, పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. పది పాసైన వారు ఏటీఎస్ కళాశాల లో ప్రవేశాలు పొందాలని కోరారు. అంజుమన్ తరఖీ ఉర్దూ సంస్థ ప్రతినిధులు డాక్టర్ అంజద్ అలిబేగ్, షేక్ హాజీ ఫరీద్‌సాబ్, షేక్ దస్తగిరి, షేక్ నూరుల్లా, షేక్ మహ్మద్, ఎం.అసత్ అలిబేగ్, ఉస్మాన్ ఖాదరి, టిప్పూ ఖాదరి, షాబీర్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే విజయం

–జగన్‌ను కలిసిన నేదురుమల్లి, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నివాసం వద్ద నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు

వెంకటగిరి(సైదాపురం): సమష్టి కృషి వల్లే వెంకటగిరి మున్సిపల్ అవిశ్వాస తీర్మానంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం నేదురుమల్లి ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తోపాటు కౌన్సిలర్లు, బీసీ నేత డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్, పార్టీ నాయకులు తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ అవిశ్వాస తీర్మానంలో జరిగిన కుట్రలు, కుతంత్రాలు, కుయుక్తులను ప్రత్యేకంగా వివరించారు. అనంతరం మాజీ సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బీఫాంపై గెలిచిన 25 మంది కౌన్సిలర్లలో చంద్రబాబు ఆరు గురిని మాత్రమే భయపెట్టి.. కొనగలిగారని, మిగిలిన 19 మంది కౌన్సిలర్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంటే నిలబడ్డారన్నారని, ఇదంతా నేదురుమల్లి కృషేనని కొనియాడారు. రాష్ట్రంలో 50 చోట్ల ఉప ఎన్నికలు నిర్వహించగా.. 39 చోట్ల వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేత డాక్టర్ మస్తాన్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర్లు, విప్ పూజారి లక్ష్మి, వైస్‌చైర్మన్‌లు సేతరాసి బాలయ్య, చింతపట్ల ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు సుబ్బారావు, తుపాటి సుజాత, ఎంఏ. నారాయణ, ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, శివ, ధనియాల రాధ, వహిద, సుభావలి, సుఖన్య, విజయలక్ష్మి, కందాటి కళ్యాణి, నాయకులు పూజారి శ్రీనివాసులు, కందాటి రాజారెడ్డి, చింతపట్ల మురళి, కొండూరు వెంకటరత్నంరాజు, యస్థాని బాషా, కల్లు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వాటా ఇవ్వాల్సిందే...!

- ఇవ్వకపోతే ఉద్యోగం చేయలేరు
- ప్రతి సబ్‌రిజిస్ట్రార్‌కు నెలకు రూ.10 లక్షలు ఇవ్వాలి
- లేదంటే ఒక్కో డాక్యుమెంట్‌కు వసూలు చేస్తా
- రెవెన్యూ అధికారుల నుంచి నెలనెలా మామూళ్లు
- టీడీపీ నేత నిర్వాకంతో పడిపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారం
- శ్రీకాళహస్తిలో అధికారపార్టీ నేత బెదిరింపులతో బెంబేలెత్తుతున్న అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో అధికారపార్టీ నాయకుడి దందాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. కూటమి పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 'మీరేమైనా చేసుకోండి. నా వాటా నాకు రావాల్సిందే. నెలనెలా వాటా రాకపోతే ఏం జరిగినా నాకు సంబంధం లేదు' అంటూ అధికారులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులను బెదిరిస్తున్నారు. చేసేది లేక అధికార పార్టీ నాయకుడు చెప్పినట్లు ఆయన వాటా ఆయనకు పంపిస్తున్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికారులకు పోస్టింగ్‌ల ఇచ్చేందుకు ప్రతి అధికారి నుంచి మామూళ్లు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక, మట్టి, కంకర అక్రమ రవాణాదారుల నుంచి నెలనెలా మామూళ్లు పుచ్చుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆక్రమించుకున్న భూములను ఆన్‌లైన్ చేయించాలన్నా ఆ నాయకుడికి మామూళ్లు ఇవ్వాల్సిందే. నియోజక వర్గంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించడంలో ఆరితేరిన ఓ సబ్ రిజిస్ట్రార్‌కు తిరిగి పోస్టింగ్ ఇప్పించేందుకు భారీగా ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. అదే సబ్‌రిజిస్ట్రార్ ద్వారా మిగిలిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి నెలనెలా మామూళ్లు ఇప్పించే బాధ్యతను కూడా అప్పగించారనే ప్రచారం జరుగుతోంది.

రియల్టర్ల నుంచి మామూళ్లు

నియోజక వర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్నా.. ఆ నాయకుడికి మామూళ్లు ఇవ్వాల్సిందే. ఇవ్వకపోతే.. వెంచర్‌లోకి అధికారులను పంపించి బెదిరింపులకు దిగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ రియల్టర్‌ని ఇంటికి పిలిపించి.. వెంచర్‌లో ఎన్ని ప్లాట్లు ఉంటే.. అంత మామూళ్లు ఇవ్వాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఆ రియల్టర్ భయపడి క్రయవిక్రయాలు చేయడం మానేసినట్లు టీడీపీ శ్రేణులు చెప్పుకుంటున్నారు. ఆ నాయకుడి దెబ్బకు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయిందని చర్చించుకుంటున్నారు. తానేం తక్కువా అనుకున్నాడేమో.. ఆ నాయకుడి డ్రైవర్ కూడా గ్రామాల్లో అక్రమణలు, ఇసుక అక్రమ రవాణాదారులకు అండగా ఉంటూ.. వారి నుంచి మామూళ్లు వసూళ్లు చేసుకుంటుండడం కొసమెరుపు.

నెలవారీ కప్పం కుదరదని చెప్పడంతో..

నియోజకవర్గంలో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్లంతా ఆయనకు నెలవారీ కప్పం కట్టాలకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. జాయినింగ్ సమయంలోనూ పెద్ద మొత్తంలో ముడుపులిచ్చి.. మళ్లీ నెలవారీ మామూళ్లు ఒక్కో సబ్ రిజిస్ట్రార్ రూ.10 లక్షలు ఇవ్వాలని, అందరి నుంచి నెలవారీ కప్పం వసూలు చేసి ఇవ్వాల్సిన బాధ్యత నియోజకవర్గంలోని ఓ సబ్ రిజిస్ట్రార్‌కు అప్పగించినట్లు తెలుస్తోంది. అయితే తన పరిధిలో రిజిస్ట్రేషన్లు తక్కువగా జరుగుతున్నాయని, అంత మొత్తం ఇచ్చుకోలేమని ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు తేల్చిచెప్పారు. ఆ మాట జీర్ణించుకోలేని ఆ నేత తనదైన శైలిలో హైడ్రామా నడిపారు. ఓ సబ్ రిజిస్ట్రార్‌ని తీవ్ర స్థాయిలో బెదిరించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక్కో డాక్యుమెంట్‌కి ఎంతెంత తీసుకుంటున్నారో తనకు తెలియదా? డబ్బులు తీసుకుని కూడా పనులు చేయడం లేదని అధికారులపై చిందులేశారు. అనూహ్య పరిణామంతో ఖంగుతిన్న కార్యాలయ సిబ్బంది అవాక్కయ్యారు. చేసేది లేక ఇకపై ప్రతినెలా అడిగినంత సమర్పించుకునేందుకు సిద్ధమయ్యారు. మరో సబ్ రిజిస్ట్రార్‌ని పిలిపించి.. ప్రతి డాక్యుమెంట్‌కు తీసుకునే మామూళ్లలో తనకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే నియోజకవర్గంలో తుక్కు వ్యాపారుల వద్ద, ఇసుక, మైనింగ్, మట్టి మాఫియా, రియల్టర్ల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ నేత విషయాన్ని జనసేనకు చెందిన వారు, టీడీపీలోని మరికొందరు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌కి ఫిర్యాదు చేసినటు సమాచారం.

టీటీడీకి ఎలక్ట్రిక్ స్కూటర్ వితరణ


వాహనాన్ని అందజేస్తున్న దాతలు

తిరుమల: మహారాష్ట్రకు చెందిన బిగాస్ ఆటో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం రూ.1.40 లక్షల విలువైన బిగాస్ సి12 మాక్స్ 3.0 ఎలక్ట్రిక్ స్కూటర్‌ను టీటీడీకి వితరణ చేసింది. శ్రీవారి ఆలయం ఎదుట డిప్యూటీ ఈవో లోకనాథంకు ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ దుర్గేష్ గుప్తా స్కూటర్ తాళాలు అందజేశారు. కార్యక్రమంలో తిరుమల డీఐ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

22 మంది విద్యార్థుల డిబార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గురువారం నుంచి ప్రారంభమైన డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షల్లో తొలిరోజు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 22 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ తెలిపారు. హైపవర్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ఇచ్చిన సమాచారం మేరకు మదనపల్లి జోన్ పరిధిలో 16 మంది, చిత్తూరు జోన్ పరిధిలో ఆరుగురు విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడగా అధికారులు వారిని డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

అభ్యంతరాల అనంతరం సీనియారిటీ జాబితా

చిత్తూరు కలెక్టరేట్ : ఇది వరకే పలుసార్లు విడుదల చేసిన సీనియారిటీ జాబితాల అనంతరం వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత జాబితా మరోసారి విడుదల చేసినట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎస్జీటీ జనరల్ సీనియారిటీ జాబితాను మెరిట్ ఆధారంగా మేనేజ్‌మెంట్ వారీగా రూపొందించినట్లు చెప్పారు. ఇప్పటికే రెండు సార్లు సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఆ జాబితాల్లో వచ్చిన అభ్యంతరాలను సరిచేసి, సవరించిన ఎస్జీటీ జనరల్ సీనియారిటీ జాబితాను చిత్తూరు డీఈవో.కామ్ (www.chittoordeo.com) వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ వెల్లడించారు.

మింగేస్తున్న.. రాహు-కేతులు!


రాహుకేతు మండపాల నుంచి పూజలు చేసుకుని బయటకు వస్తున్న భక్తులు

- ముక్కంటి ఆలయంలో విచ్చలవిడిగా వసూళ్లు
- రాహు-కేతు పూజల పేరుతో దోచుకుతింటున్న దళారులు
- దక్షిణం పేరుతో యథేచ్ఛగా దందా
- రోజుకు నగటున ఒక్క రాహు-కేతు పూజల్లోనే రూ.5 లక్షలకుపైగా దిగమింగుతున్న వైనం
- కన్నెత్తి చూడని అధికార గణం

పట్టిన శనిగ్రహాన్ని వదిలించుకోవాలని, దోషనివారణ తొలగించుకోవాలని భక్తులు ఆరాటపడుతుంటారు. దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా వర్ధిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయానికి క్యూ కడుతుంటారు. అక్కడ జరిగే రాహు-కేతు పూజలతో తమ దోషాన్ని తొలగించుకోవచ్చని నమ్ముతుంటారు. అందుకే పెద్ద ఎత్తున దోషనివారణ పూజలు చేసుకుంటుంటారు. ఇదే అదునుగా రాహు-కేతు మండపాల్లో తిష్టవేసిన దళారులు, పూజలు కొందరు భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. దక్షిణం పేరుతో భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. దక్షిణ వేస్తేనే దోషం పోతుందని బురిడీ కొట్టిస్తున్నారు. నెలకు సుమారు రూ.కోటి పైనే అక్రమంగా వసూళ్లు చేసి పంచుకుతుంటున్నా అటువైపు ఏ ఒక్కరూ కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం దక్షిణ కైలాసంగా, శివయ్య పంచభూత లింగాలలో ముఖ్యమైన వాయు లింగంగా వర్ధిల్లుతోంది. దక్షిణ కైలాసంగా.. సద్యోముక్తి క్షేత్రంగా పురాణాల్లో ఖ్యాతి గడించింది. ఇక్కడ స్వామివారి తల మీద ఐదు తలల పాము రాహువు గాను, అమ్మవారి వడ్డాణంలో ఒక తల పాము కేతువుగా పూజలందుకుంటున్నాయి. ఇక్కడ చేసే సర్ప దోష నివారణ, రాహు-కేతు, పాప గ్రహ దోష నివారణ పూజలకు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతోపాటు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి రాహు-కేతు పూజల కోసం భక్తులు శ్రీకాళహస్తి ఆలయానికి వస్తుంటారు.

పాపహరణం పేరుతో నిలువు దోపిడీ

రాహు-కేతు పూజల కోసం అన్ని పూజా సామగ్రి, ద్రవ్యాలు ఆలయం తరఫున అందజేస్తున్నారు. పూజ అనంతరం పూజారులు రాహు-కేతు పూజలు చేసుకున్న భక్తులు పూజా ఫలాన్ని సంపూర్ణంగా అందుకోవాలంటే, గోదానం, భూదానం, వస్త్రదానాలలో ఏదో ఒక దానం చేయాలని, ప్రస్తుతానికి అవన్నీ లేకపోవడం వల్ల రూ.101 దక్షిణగా పెట్టాలని భక్తుల మనోభావాలపై, విశ్వాసంపై ఆంక్షలు పెట్టి డబ్బులు దండుకుంటున్నారు. పూజ అనంతరం భక్తుల మనోభావాలతో ఆడుకుని అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు.

దళారుల దందా

ఆలయం చుట్టుపక్కల రాత్రి నిద్ర చేసి పూజ చేసుకోవాలని వచ్చిన భక్తులను ఉదయం లేపి మరీ దళారులు దోచుకుంటున్నారు. పసుపు దారం చెట్లకు కట్టి, దీపాలు పెట్టి రాహు-కేతు పూజలు చేసుకోవాలంటూ భక్తులను బురిడీ కొట్టిస్తున్నారు. ఆపై వారి దగ్గర రెండు దీపాలు, పసుపు దారాలు, టెంకాయలు అవసరం లేకున్నా ఎక్కువ ధరలకు అంటగడుతున్నారు.

మండపాల్లో పనిచేయడానికి పోటీ

కాసుల వర్షం కురుస్తుండడంతో రాహు-కేతు పూజా మండపాల్లో పనిచేయడానికి స్వీపర్ నుంచి సెక్యూరిటీ వరకు అందరూ పోటీ పడుతుంటారు. పూజారులైతే పెద్ద ఎత్తున లాబీయింగ్ చేసి మరి విధులు నిర్వహిస్తుంటారు. గతంలో వేద పండితులు ఎవరూ రాహు-కేతు మండపాల్లో పని చేయకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి మరీ అక్కడ పని చేయడానికి పోటీపడుతున్నారు. ఇప్పటికైనా ఆలయాధికారులు రాహు-కేతు పూజల పేరుతో జరుగుతున్న అక్రమ దోపిడీని అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నెలకు రూ.కోటి పైనే వసూళ్లు

సుమారు నెలకు పది వేలకు పైగా రాహు-కేతు పూజలు చేస్తుంటారు. పూజకు వంద రూపాయలు వసూలు చేసినా.. నెలకు కోటి రూపాయల దాకా రాహు-కేతువు పూజా మండపాల్లో అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ డబ్బుల్ని కింద నుంచి పై వరకు అందరూ పంచుకోవడం వల్లే ఎవ్వరూ దీనిపై నోరుమెదపడం లేదన్న విమర్శలున్నాయి. భక్తులెవరైనా ఫిర్యాదు చేసినా... వారిపైనే ఎదురుదాడికి దిగే పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది.


రాహు-కేతు టికెట్లు విక్రయించే కౌంటర్లు

రాహు-కేతు పూజలిలా!

ఆలయానికి వచ్చే భక్తులలో సగటున రోజుకు 3 వేలకు పైగా, శని, ఆది, సోమ వారాల్లో 7వేల వరకు రాహు-కేతు పూజలు జరుగుతుంటాయి. ఇటీవల శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో రికార్డు స్థాయిలో రాహు-కేతు పూజలు నమోదవుతున్నాయి. రూ.500, రూ.750, రూ.1,500 ఆలయం బయట, ఆలయ మండపాలలో జరుగుతుండగా, రూ.2,500, రూ.5,000 పూజలు ఆలయం లోపల నిర్వహిస్తున్నారు. సాధారణంగా ఎక్కువ మంది భక్తులు రూ.500 రాహు-కేతు దోష నివారణ పూజలు చేసుకుంటారు. ఆలయంలో చేసుకోవాలనుకునే వారి కోసం రూ.2,500 శివ కల్యాణ మండపం, రూ.5,000 పూజలు స్వామివారి ఆలయం ఎదురుగా ఉన్న మండపం వద్ద నిర్వహిస్తున్నారు.

గతంలో గగ్గోలు - అధికారంలోకి వచ్చాక అనుయాయులతో అక్రమాలు

గతంలో టీడీపీ నాయకులు రాహు-కేతు మండపాల్లో ఏదో జరిగిపోతోందని గగ్గోలు పెట్టారు. ఇష్టారాజ్యాంగ దోచుకుంటున్నారంటూ విషప్రచారానికి బీజం వేశారు. మరి ప్రస్తుతం దోష పూజల్లో ఆలయ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా ముఖ్య నాయకుడు కట్టడి చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పార్టీ బలోపేతమే లక్ష్యం


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో హరిప్రసాద్‌రెడ్డి

తిరుపతి సిటీ: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి విశేష కృషి చేస్తామని నూతనంగా ఎంపికైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వి.హరి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. తనకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేసినందుకు గురువారం విజయవాడలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హరిప్రసాద్‌రెడ్డి మట్లాడుతూ 2004 నుంచి ఎస్వీయూ వేదికగా విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశామని, వర్సిటీ అధ్యక్షులుగా, ఉమ్మడి రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా, సమైక్యాంధ్ర ఉద్యమంలో జేఏసీ కన్వీనర్‌గా ఉద్యమాలు చేశానని గుర్తుచేశారు. అలాగే 2014లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడుగా, విద్యార్థి విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్‌గా పనిచేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డికి, పార్టీ అనుబంధ విభాగాల కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ సేవలకు అవార్డులు

తిరుపతి అర్బన్: ఉత్తమ సేవలకుగాను జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవికి అవార్డు లభించింది. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా విజయవాడలో ఆమె అవార్డు అందుకున్నారు. జిల్లాలో 2024–25 సంవత్సరానికి సంబంధించి పన్నులు రూ.53.01కోట్ల మేర వసూలు చేయాల్సి ఉండగా.. అందులో రూ.44.21 కోట్లు వసూలు చేసి, జిల్లాను రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలబెట్టారు. ఈ మేరకు ఆమెకు అవార్డు లభించింది. అలాగే ఉత్తమ సేవలందించిన జిల్లా పంచాయతీ రాజ్ అధికారి రామ్మోహన్‌కు కూడా అవార్డు లభించింది.

వేడుకగా సీఎంఆర్ జ్యువెలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూం ప్రారంభం


సీఎంఆర్ జ్యువెలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూంను ప్రారంభిస్తున్న ప్రముఖ సినీ నటి మీనాక్షిచౌదరి

తిరుపతి కల్చరల్: ప్రకాశం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ జ్యువెలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూంను గురువారం వేడుకగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ప్రముఖ సినీనటి మీనాక్షి చౌదరి హాజరై సీఎంఆర్ జ్యువెలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూంను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుమల శ్రీవారి పాదాల చెంత సీఎంఆర్ జ్యువెలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూం ఆరంభించడం అభినందనీయమన్నారు. సినిమాపరంగా తాను నాగచైతన్య, నవీన్ పోలిశెట్టితో రెండు సినిమాలు చేస్తున్నానని, ఈ రెండు సినిమాలు చాలా డిఫరెంట్ రోల్స్ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీఎంఆర్ గ్రూప్స్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ ట్రెండ్‌కు అనుగుణంగా తిరుపతిలో అతిపెద్ద బంగారు ఆభరణాల ఎక్స్‌క్లూజివ్ షోరూంను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. షోరూంలో బంగారు ఆభరణాలపై అతి తక్కువ తరుగు 3 శాతం నుంచి ప్రారంభమవుతుందని, వెండి రెగ్యులర్ వస్తువులపై తరుగు మజూరీ లేదన్నారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా బంగారు ఆభరణాల వీఏ పై 25 శాతం తగ్గింపు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తినాని, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, జనసేన నేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ప్రముఖ వ్యాపార వేత్తలు సాగర్, మావూరి శ్రీనివాసు, తిరుపతి క్లాత్ మర్చంట్ అండ్ రెడీమేడ్ వ్యాపారుల సంఘం కార్యదర్శి సుబ్రమణ్యం(పరదాలమణి), వివిధ వ్యాపార ప్రముఖులు పాల్గొని షోరూం అధినేత మావూరి వెంకటరమణను అభినందించారు. షోరూం అధినేత సతీమణి మావూరి పద్మావతి, కుమారుడు మోహన్ బాలాజీ, కోడలు హేమహారిక, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

2027–28లో చంద్రయాన్–4 ప్రణాళిక


జాతీయ సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2027–28 ఆర్థిక సంవత్సరంలో చంద్రయాన్–4 ప్రయోగాన్ని నిర్వహించేందుకు ప్రణాళికగా పెట్టుకున్నట్టు ఇస్రో శాస్త్రీయ కార్యదర్శి ఎం.గణేష్ పిళ్లై వెల్లడించారు. చంద్ర నమూనా శాస్త్రం సంభావ్య అంశాలపై గురువారం ఒక జాతీయ సమావేశాన్ని అహమ్మదాబాద్‌లో ఫిజిక్స్ లేబోరేటరీ కార్యాలయంలో నిర్వహించినట్టు ఇస్రో తన వెబ్‌సైట్ ద్వారా తెలియజేసింది. ఈ సమావేశంలో ఉల్క నమూనాలు, భూసంబంధమైన అన్‌లాగ్‌లు, చంద్రుడి నేల అనుకరణలను విశ్లేషించారు. చంద్రుడి ఉపరితలంపై రిమోట్ సెన్సింగ్ పరిశీలనలను పరిమితం చేయడానికి ఆసక్తి ఉన్న శాస్త్రవేత్తలు సుమారు 50 మంది దాకా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారిలో దాదాపు 50 శాతం మంది దేశవ్యాప్తంగా ఉన్న ప్రయివేట్ విద్యాసంస్థలతో సహా 12 పరిశోధన విద్యాసంస్థలు వారు ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా గణేష్ పిళ్లై మాట్లాడుతూ భారతదేశ చంద్రుడి అన్వేషణ కార్యక్రమానికి సంబంధించిన రోడ్ మ్యాప్‌ను రూపొందించామని తెలిపారు. 2040 నాటికి చంద్రుడిపై వ్యోమగాములను పంపించి తిరిగి క్షేమంగా తీసుకొచ్చేందుకు తలపెట్టబోయే ఈ ప్రయోగానికి ఈ జాతీయ సమావేశం ఎంతో దోహదపడుతుందన్నారు. చంద్రయాన్–4 ప్రయోగానికి సంబంధించి చంద్ర నమూనా క్యూరేషన్, విశ్లేషణల సౌకర్యాల ప్రణాళికలపై ఇస్రోలోని యూఆర్ రావు ఉపగ్రహ కేంద్రం (యూఆర్‌ఎస్‌సీ) బృందాలతో చర్చలు జరిగినట్టు తెలిపారు.

వెబ్‌సైట్‌లో పాలిసెట్-2025 హాల్ టికెట్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 30వ తేదీన పాలిసెట్-2025 పరీక్షను నిర్వహించనున్నట్లు తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్ టికెట్లను ''పీఓఎల్‌వైసీఈటీఏపీ.ఎన్‌ఐసీ.ఇన్'' వెబ్‌సైట్‌లో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులు ఇంటర్నెట్ సెంటర్ నుంచి గాని, సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్ నుంచి గాని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

తిరుమలలో మాక్ డ్రిల్



ఉగ్రవాదులు దూరిన భవనంలోకి వెళ్తున్న ఆక్టోపస్ బృందం, ఆక్టోపస్ సిబ్బందితో పోలీసులు, విజిలెన్స్ అధికారుల సంప్రదింపులు

తిరుమల: కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడి నేపథ్యంలో ముంద జాగ్రత్తగా తిరుమలలో ఉగ్రవాదులు చొరబడినప్పుడు ఎలా ఎదుర్కోవాలి, భక్తులను ఎలా రక్షించాలి అనే విషయాలను లేపాక్షి సర్కిల్ వద్ద ఉన్న సుదర్శన్ సత్రంలో గురువారం సాయంత్రం భద్రతా దళాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. అదనపు ఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఉగ్రదాడి జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై టీటీడీ నిఘా, భద్రతా, సివిల్ పోలీసులకు, రిజర్వు పోలీసులకు, ఆలయ సిబ్బందికి, వైద్య సిబ్బందికి క్షుణ్ణంగా వివరించారు. అసాల్ట్ డాగ్ ఎనిమీ ఎటాక్, రూమ్ ఇన్టర్వెన్షన్ కార్యకలాపాలు చేసి చూపారు. దాదాపు ఒకటిన్నర గంటపాటు ఈ మాక్ డ్రిల్ కొనసాగింది. ఈ మాక్ డ్రిల్‌లో 28 మంది ఆక్టోపస్ కమాండోలు, 25 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, 15 మంది పోలీసులు, 10 ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర, డీఎస్పీ విజయశేఖర్ పాల్గొన్నారు.

అలిపిరిలో ముమ్మర తనిఖీలు

అలిపిరి వద్ద హైఅలెర్ట్ ప్రకటించారు. తిరుమలకొచ్చిపోయే ప్రతి వాహనాన్నీ తనిఖీ చేశారు. రెండు ఘాట్ రోడ్లలో డాగ్స్ స్క్వాడ్ బాంబు స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి. తిరుమలకి వెళ్లే సమయంలో లింకు రోడ్డు వద్ద కూడా పోలీసులు ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు కొద్దిరోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు.

పది పాసైన విద్యార్థులకు సువర్ణావకాశం

- నేషనల్ వర్సిటీలో ఇంటర్ చదివే భాగ్యం
- ఇంటర్మీడియెట్ (ప్రాక్‌శాస్త్రి) కోర్సులకు ఆహ్వానం పలుకుతున్న ఎన్ఎస్‌యూ
- వచ్చే నెల 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రారంభం


ఎన్ఎస్‌యూ భవనం

తిరుపతి సిటీ: జిల్లా విద్యార్థులకు నేషనల్ యూనివర్సిటీలో ఇంటర్మీడియెట్ చదివే అవకాశాన్ని తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీ కల్పిస్తోంది. పదోతరగతి పాసైన విద్యార్థులు ఇంటర్మీడియెట్ కోర్సులో (పాక్‌శాస్త్రీ) చేరేందుకు అవకాశం కల్పిస్తూ వచ్చే నెల 3వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. ఇందులో ఇంగ్లిషు, హిందీ, సంస్కృతం, తెలుగు మాధ్యమాలు ఉంటాయన్నారు. ఇంటర్మీడియెట్ కోర్సుల్లో కంప్యూటర్, గణితం, హిస్టరీ, వ్యాకరణం, సాహిత్యం, జ్యోతిష్యం, పిలాసఫీ, యోగా వంటి సబ్జెక్టుల్లో బోధన ఉంటుందని పేర్కొన్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా జాతీయ సంస్కృత వర్సిటీలో పాక్‌శాస్త్రీ కోర్సులలో అడ్మిషన్లు పొందే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు హాస్టల్ వసతి కల్పించనున్నట్టు తెలిపారు.

వచ్చేనెల 3 నుంచి దరఖాస్తులు

జాతీయ సంస్కృత వర్సిటీలో ఇంటర్మీడియెట్ కోర్సులు చేరదలుకున్న విద్యార్థులు వచ్చే నెల 3వ తేదీ నుంచి వర్సిటీ వెబ్‌సైట్ www.nsktu.ac.inలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులకు కోసం వర్సిటీలో అకడమిక్ సెక్షన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోండి



ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సీ పరీక్షల ఫలితాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జాతీయ సంస్కృత వర్సిటీ ఆహ్వానం పలుకుతోంది. నేషనల్ యూనివర్సిటీలో ఇంటర్మీడియెట్ కోర్సు పూర్తి చేసే అవకాశం వర్సిటీ కల్పిస్తోంది. పాక్‌శాస్త్రీ (ఇంటర్మీడియెట్) కోర్సుకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు సైతం అందనున్నాయి.
–ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వీసీ, ఎన్ఎస్‌యూ

నేను వచ్చినప్పుడైనా లైట్లు వెలగాలి కదా?

- మీ ఇంట్లో ఇలాగే విద్యుత్ పనులు చేయించుకుంటారా?
- వసతి గృహంలో పనుల తీరుపై కలెక్టర్ మండిపాటు

దొరవారిసత్రం: 'మీ ఇంట్లో అయితే ఇలాగే విద్యుత్ పనులు చేయించుకుంటారా?.. నేను వచ్చినప్పుడైనా లైట్లు వెలగాలి కదా..?' అంటూ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులు, సిబ్బందిపై మండిపడ్డారు. దొరవారిసత్రంలోని బాలికల వసతి గృహంలో రూ.18 లక్షలతో జరుగుతున్న మరమ్మతు పనులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది పని తీరుపై గురువారం ఆయన ఆరాతీశారు. వసతి గృహంలో విద్యుత్ పనులు, మరుగుదొడ్ల నిర్మాణాలు సక్రమంగా లేకపోవడంతో సంబంధిత సాంఘిక సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులపై మండిపడ్డారు. 'మీ ఇళ్లల్లో అయితే అరకొరగా పనులు చేస్తారాని..?' అని ప్రశ్నించారు. వసతి గృహంలో జరుగుతున్న పలు మరమ్మతు పనులను పరిశీలించారు. వసతి గృహాన్నికి మరో రూ.22 లక్షలు కేటాయించినట్టు పేర్కొన్నారు. ఈ నిధులతో విద్యార్థుల సౌకర్యార్థం ఆర్వో ప్లాంట్, స్టడీ ప్లాట్‌ఫారం, ఉన్న ప్రహరీని ఎత్తు పెంచడం లాంటి పనులు చేయాలని చెప్పారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రవేశించగానే ప్రధాన ద్వారం అంతా చీకటిగా ఉండడంతో కనీసం నేను వచ్చినప్పుడైనా లైట్లు వేయాలి కదా అని వైద్యాధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ల్యాబ్, మందుల గది, ప్రసవం గదులను తనిఖీ చేయాడంతో పాటు రోగులు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అదే సమయంలో ఏకొల్లు మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉదయ్‌కుమార్, స్థానిక ప్రాంతానికి చెందిన పలువురు పీహెచ్‌సీలో డాక్టర్లు సక్రమంగా ఉండడం లేదని, వైద్యం కోసం వస్తే పట్టించుకోకుండా కబుర్లు చెప్పుకుంటూ ఫోన్లు చూసుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ.. 'లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటూ రోగులకు వైద్యం చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు?.. ఎక్కడ చూసినా లైట్లు వెలగకుండా ఉంటున్నాయి?.. వైద్యులు, సిబ్బంది పని చేస్తున్నారా లేదా?' అంటూ అసహనం వ్యక్తం చేశారు. డీవీ సత్రం పీహెచ్‌సీ, తొగరాముడి పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీఓ గోవర్ధన, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొంత పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 68,795 మంది స్వామిని దర్శించుకున్నారు. 25,382 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.62 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 12 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


శ్రీకాంత్ మృతదేహం

భాకరాపేట : తలకోన అడవుల్లో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. గురువారం ఎర్రావారిపాళెం మండలం, చింతగుంట పంచాయతీ, పచ్చార్లవాండ్లపల్లెకు చెందిన కంచన శ్రీకాంత్ (32) తలకోన అటవీ ప్రాంతంలోని చింతగుంట సమీపంలోని చిక్కనగుంట ప్రాంతంలో మృతి చెందినట్లు గ్రామస్తులు కనుగొన్నారు. విషయం తెలుసుకున్న భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా, అటవీశాఖ, విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం పడి ఉన్న పరిస్థితి, ఆ ప్రాంతంలో రక్తం గడ కట్టి ఉన్న ఆనవాళ్లు, చెప్పులు, కొడవలి, పంచె పడి ఉన్న తీరును చూస్తే పలు అనుమానాలకు దారి తీస్తున్నట్లు అంచనాకు వచ్చారు. పోస్టుమార్టం రిపోర్టులో వాస్తవాలు బయటకి వస్తాయని సీఐ ఇమ్రాన్‌బాషా చెబుతున్నారు.